ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తిరుపతి జిల్లా వార్తలు

శనివారం 1 జూన్ 2024

జూకు కొత్తగా రెండు తోడేళ్లు




మంగళం, మే 31: తిరుపతిలోని ఎస్వీ జూపార్కుకు కొత్తగా రెండు తోడేళ్ల తెప్పించారు. యానిమల్ ఎక్స్చేంజ్ స్కీమ్‌లో భాగంగా బెంగళూరులోని బన్నారగుట్ట జూపార్కు నుంచి ఒక ఆడ, ఒక మగ తోడేళ్లను తిరుపతికి తీసుకొచ్చారు. అలాగే ఇక్కడినుంచి రెండు హైనాలను బెంగళూరు జూకు పంపారు. తీసుకొచ్చిన రెండు తోడేళ్లను 45రోజులపాటు అబ్జర్వేషన్‌లో ఉంచి అనంతరం సందర్శకుల కోసం ఎన్‌క్లోజర్‌లో వదలనున్నారు. ఇటీవల జూకు తీసుకొచ్చిన నీటి ఏనుగులు.. సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

మరిన్ని జంతువులను తీసుకొస్తాం



గోవా, హైదరాబాదు, చెన్నై జూలనుంచి త్వరలోనే మరిన్ని కొత్త జంతువులను తీసుకొస్తాం. అలాగే ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఫీడ్ వెహికల్, జంతువులకు మత్తు ఇచ్చేందుకు ఉపయోగించే గన్ను, సందర్శకుల దాహార్తి తీర్చేందుకు జూలో ఆర్వో ప్లాంట్‌ను తదితరాలను రూ.19.4లక్షలతో ఏర్పాటు చేస్తున్నాం. రాత్రిపూట మాత్రమే సంచరించే జంతువుల కోసం ఏర్పాటు చేస్తున్న ఎన్‌క్లోజర్ పనులు వేగవంతం చేశాం. త్వరలోనే అందుబాటులోకి తెస్తాం.

\- సెల్వం, జూ క్యూరేటర్

'కౌంటింగ్'కు పటిష్ఠ భద్రత

- 2,549 మంది పోలీసులు, కేంద్రబలగాల మోహరింపు
- మూడు డ్రోన్లతో వీడియో చిత్రీకరణ
- ఎస్పీ హర్షవర్ధనరాజు వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), మే 31: కౌంటింగ్ రోజున పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో సీబీడీ ఎస్పీ సరిత, అదనపు ఎస్పీలు విమలకుమారి, కులశేఖర్, వెంకట్రావులతో కలసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కౌంటింగ్ రోజున కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా దాదాపు 2,549 మంది పోలీసులతో భారీ భద్రత ఉంటుందన్నారు. వీరితోపాటు రెండు కంపెనీల సీఐఎస్ఎఫ్ ఫోర్సు, ఆరు ప్లటూన్ల కేంద్ర బలగాలు, 30 మంది తమిళనాడు పోలీసులు, ఏపీఎస్పీ బలగాలు రెండు కంపెనీలు, సివిల్ సీఐలు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, సాయుధ బలగాలు అందుబాటులో ఉంటారన్నారు. అదనంగా మరో రెండు కంపెనీల కేంద్ర బలగాలు తిరుపతికి వస్తున్నాయని వెల్లడించారు. పోలింగ్ తర్వాత చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం నేపథ్యంలో ముందస్తుగా అభ్యర్థులందరికీ 1+4 భద్రతతోపాటు ప్రత్యేకంగా ఎస్కార్టు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు ఎన్నికల్లో వివిధ ప్రాంతాల్లో ఘర్షణలు, అల్లర్లు, విధ్వంసాలు ఇతరత్రా ఘటనలకు సంబంధించి 310 మందిని గుర్తించగా.. దీనిపై ఐదుగురు పోలీసు అధికారులతో కూడిన కమిటీ సూచించిన 57 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేశామన్నారు. ఇందులో ఎలాంటి వివక్ష లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

నాలుగు అంచెలతో..

పద్మావతి మహిళా వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద ప్రస్తుతం మూడంచెల భద్రత ఉందని, కౌంటింగ్ రోజున నాలుగు అంచెల భద్రత ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, ఏజెంట్లు, ఆర్వోలు, ఏఆర్వోలు, పరిశీలకులు, పోలింగ్ సిబ్బంది, అభ్యర్థులకు సంబంధించిన గన్‌మెన్ తప్ప ఇతరులకు ప్రవేశం లేదని స్పష్టం చేశారు. మీడియా పాయింట్ వద్దకు ఎన్నికల కమిషన్ పాసులున్న వారిని అనుమతిస్తామని, ఓబీ వ్యాన్లకు ప్రత్యేకంగా స్థలం కేటాయించినట్లు ఎస్పీ చెప్పారు. 144 సెక్షన్, 30 పోలీసు యాక్టును గట్టిగా అమలు చేస్తామన్నారు. వీలైనంత వరకు కౌంటింగ్ రోజున ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకుండా ఉంటే మంచిదన్నారు.

25 చెక్‌పోస్టులు

కౌంటింగ్ కేంద్రం చుట్టూ 25 చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. ఎవరైనా మద్యం తాగి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ నో ఫ్లయింగ్, రెడ్ జోన్ ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ కేంద్రం వద్ద మూడు డ్రోన్లతో వీడియో చిత్రీకరణ ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రం భద్రతకు ఎలాంటి ఢోకా లేదన్నారు.

నిర్దేశించిన రూట్లు ఇవే..

అభ్యర్థులు, ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది కౌంటింగ్ కేంద్రం వద్దకు కూడా నిర్దేశించిన రూట్ల ద్వారా మాత్రమే రావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ఆరు నియోజకవర్గాలకు ఇలా..

చంద్రగిరి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, గూడూరు, సత్యవేడు, సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, జనరల్ ఏజెంట్లు, ఆర్వోలు, ఏఆర్వోలు, పరిశీలకులు జాతీయ రహదారి మీదుగా రామానుజపల్లె చెక్‌పోస్టు, తుమ్మలగుంట క్రాస్, పద్మావతి మహిళా వర్సిటీ కటాఫ్ నుంచి పెద్ద గేటు ద్వారా కౌంటింగ్ కేంద్రంలోకి చేరుకోవాలి. లోపల ఏర్పాటు చేసిన నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.

- మిగిలిన ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది జాతీయ రహదారి నుంచి ఆర్సీపురం జంక్షన్, అన్నమయ్య సర్కిల్, ఎంఆర్‌పల్లె సర్కిల్, పొంగులేటి సీతమ్మ రోడ్డు వద్దకు చేరుకుని, అక్కడ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు ఉంచాలి. ఆ తర్వాత నడుచుకుంటూ కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లాలి.

తిరుపతికి ఇలా..

తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులు, జనరల్ ఏజెంట్లు, ఆర్వోలు, ఏఆర్వోలు, పరిశీలకులు.. వెంగమాంబ సర్కిల్, రాళ్లపల్లి విగ్రహం, పద్మావతి మహిళా వర్సిటీ చిన్న గేటు మీదుగా కౌంటింగ్ కేంద్రంలోకి చేరుకోవాలి. వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలి.

- మిగిలిన ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది ఎంఆర్‌పల్లె సర్కిల్ మీదుగా పొంగులేటి సీతమ్మ రోడ్డు ఎంట్రీ పాయింటు వద్ద వాహనాలను ఆపేయాలి. తర్వాత నడుచుకుంటూ కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి. నడవలేని వారి కోసం ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాలను ఉపయోగించుకోవచ్చు.

అడుగడుగునా నిర్లక్ష్యం

చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌పై వేటుకు కారణం

ఆయన స్నేహితుడి అధీనంలో అధికారిక వాహనం

తిరుపతి (నేరవిభాగం), మే 31: చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌పై బదిలీ వేటు పోలీసువర్గాల్లో చర్చగా మారింది. మూడు నెలల క్రితం తూర్పుగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నుంచి చంద్రగిరి డీఎస్పీగా వచ్చిన శరత్‌రాజ్‌కుమార్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపించారనే విమర్శలున్నాయి. చంద్రగిరికి ఎన్నికల కమిషన్ ఆయన్ను నోడల్ అధికారిగా నియమించింది. రామిరెడ్డిపల్లె, కూచువారిపల్లె, బ్రాహ్మణకాలువ గ్రామాల్లో రాజకీయ ఘర్షణలు చోటుచేసుకోవడం వెనుక పోలీసు అలసత్వానికి ఆయనే బాధ్యుడని భావిస్తున్నారు. కూచువారిపల్లెలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలపై వైసీపీ శ్రేణులు కర్రలు, రాడ్లతో దాడిచేసి, తీవ్రంగా గాయపరచినా నిందితులపై కేసులు నమోదు చేయడంలో డీఎస్పీ పూర్తిగా విఫలమయ్యారు. తాము కూచివారిపల్లెని సందర్శించిన తర్వాతే కేసులు నమోదు చేయడాన్ని సిట్ బృందం తప్పు పట్టింది. కొటాల చంద్రశేఖర రెడ్డి ఇల్లును తగులపెట్టినా ఆ తర్వాత అప్రమత్తం కావాల్సిన పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. తొలి నుంచి ఆయన వైసీపీకి వీర విధేయుడిగా మెలిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా వుండగా డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌కు పోలీసు శాఖ కేటాయించిన ప్రభుత్వ వాహనాన్ని ఆయన స్నేహితుడు, కడపకు చెందిన సుదర్శన్ వాడుతున్నట్టు కూడా అధికారుల దృష్టికి వచ్చింది. నర్సింగ్ కాలేజీ యజమాని అయిన ఆయన పోలీసు స్టిక్కరున్న వాహనాన్ని దర్జాగా వాడుకునేవారన్న ఆరోపణలు ఉన్నాయి. బుధవారం సాయంత్రం పోలీసు కారులో సుదర్శన్ మహిళా వర్సిటీ స్ట్రాంగ్ రూము లోపలకు వెళ్లడానికి ప్రయత్నించాడని అంటున్నారు. డీఎస్పీ వర్సిటీ లోపల విధుల్లో వుంటే ఆయన కారులో ఎవరు వస్తున్నారు అనే అనుమానంతో అక్కడ వున్న సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నించారని తెలిసింది. వారిని దబాయించిన ఆయన కారును నేరుగా స్ట్రాంగ్‌రూము వద్దకు తీసుకెళ్లారని అంటున్నారు. దీనిపై ఎస్బీ పోలీసులు ఎస్పీకి సమాచారం అందించారు. డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఎస్పీ రిపోర్టు పంపడంతో ఆయన్ను వీఆర్‌కు పంపారు. ఆయనపై వేటు వేయడానికి ప్రధాన కారణం శాంతి భద్రతల పరిరక్షణకు కేటాయించిన కారును దుర్వినియోగం చేయడం. శాంతి భద్రలను గాలికి వదిలేయడం అని అంటున్నారు.

ఇన్‌చార్జి డీఎస్పీగా రవికుమార్

తిరుపతి క్రైం డీఎస్పీ రవికుమార్‌ను చంద్రగిరి ఇన్‌చార్జి డీఎస్పీగా నియమించారు. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రూరల్, కూచివారిపల్లె, బ్రాహ్మణకాలువ, రామిరెడ్డిపల్లె తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. కౌంటింగ్ రోజు, ఆ తర్వాత తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించారు.



తిరుపతిలో బోసిపోతున్న ఫ్లైఓవర్, రహదారి

వామ్మో ఇవేమి ఎండలో..!

వేడి, ఉక్కపోతతో జనం బెంబేలు ● డీవీసత్రంలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

తిరుపతి(కలెక్టరేట్), మే 31: జిల్లాలో రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. భానుడి ప్రతాపానికి జనం వేడి, ఉక్కపోతతో బెంబేలెత్తుతున్నారు. రోహిణికార్తె కావడంతో ఉదయం ఎనిమిది గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. సాయంత్రం ఆరు గంటల వరకు వేడి వాతావరణం ఉండటంతో వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు అల్లాడిపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే తిరుపతి నగరంలోని రహదారులు కూడా నిర్మానుష్యంగా మారుతున్నాయి. శ్రీకాళహస్తి, తిరుపతి, తిరుమల, తిరుచానూరు ప్రముఖ ఆలయాల వద్ద భక్తులు ఎండ వేడిమికి ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం డీవీసత్రంలో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. చిల్లకూరులో 43.7, గూడూరు, నాగలాపురం, నాయుడుపేట, పిచ్చాటూరుల్లో 43.6, మిగిలిన మండలాల్లో 42డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాకాలలో మాత్రం అత్యల్పంగా 38.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



శ్రీవారి ఆలయం ముందు నీటిని చల్లుతున్న పారిశుధ్య మహిళ

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



పద్మావతమ్మ(ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, మే 31: రెండు రోజులుగా భానుడి భగభగలకు భరించలేని ఓ వృద్ధురాలు వడదెబ్బకు గురై మృతి చెందింది. చంద్రగిరిలోని నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన రావూరి పద్మావతమ్మ(84) ఎండ తీవ్రత తట్టుకోలేక.. తీవ్ర అస్వస్థతకు గురై గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

మామండూరులో ఏనుగుల బీభత్సం



మామిడితోపులో ఏనుగు

రేణిగుంట, మే 31: రేణిగుంట మండలం మామండూరులోని మామిడితోపుపై రెండు ఏనుగులు పడి బీభత్సం సృష్టించాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. రెండ్రోజుల కిందట ఏనుగుల గుంపు మామిడితోపు సమీపంలో వచ్చి వెళ్లింది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం రెండు పెద్ద ఏనుగులు మామిడితోపులోకి ప్రవేశించాయి. చెట్లను విరిచేసి, కాయలు రాల్చేస్తూ బీభత్సం సృష్టించాయి. గ్రామస్తులంతా గుమికూడి పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ.. అతికష్టంపై వాటిని అడవుల్లోకి తరిమేశారు. కాగా, గత నెల 8వ తేదీన కూడా ఏనుగుల గుంపు దాదాపు 60 ఎకరాల్లోని మామిడి చెట్లను ధ్వంసం చేసిందని, ఇప్పటి వరకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా పూడిపోయిన కందకాలను బాగుచేసి, ఏనుగుల బారి నుంచి రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు.

15 కిలోల గంజాయి స్వాధీనం : ఒకరి అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న సెబ్ అధికారులు

గూడూరు, మే 31: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎస్ఈబీ కార్యాలయంలో సీఐ రమేష్ మీడియాకు వివరాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా బీరోలే గ్రామానికి చెందిన పాపన్న గూడూరు ఆర్టీసీ బస్టాండు సమీపంలో వినాయకగుడి వద్ద బ్యాగును తగిలించుకుని అనుమానాస్పదంగా కనిపించాడు. తనిఖీ చేయగా, అతడి వద్ద 15 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. వెంటనే పాపన్నను అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ మోసెస్, కానిస్టేబుళ్ల కిరణ్‌సింగ్, ప్రసాద్, కృష్ణయ్య, గౌస్‌బాషా, ఆనంద్‌బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలు నేటినుంచి పునఃప్రారంభం

తిరుపతి(విద్య), మే 31: జిల్లాలో జూనియర్ కళాశాలలు శనివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. 22 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ తరగతులతోపాటు ప్రథమ సంవత్సర ప్రవేశాలు కూడా చేపట్టనున్నారు.

పాఠ్య పుస్తకాల కొరత : ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాల కొరత కనిపిస్తోంది. ఎందుకంటే కళాశాలలు పునఃప్రారంభం కావస్తున్నా ఇప్పటికీ పుస్తకాల పంపిణీ జరగలేదు. రెండేళ్లుగా పాఠ్య పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం అందించలేకపోయిందని, ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, శనివారం అధ్యాపకులంతా తప్పనిసరిగా కళాశాలలకు హాజరై, బయోమెట్రిక్ వేయాలని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కి 189మంది హాజరు

తిరుపతి(విద్య), మే 31: తిరుపతి కేటీరోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రంలో జరుగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్‌కు శుక్రవారం 189మంది విద్యార్థులు హాజరై తమ సర్టిఫికెట్లు వెరిఫై చేసుకున్నారని కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. 59001-75000 ర్యాంకుల వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించామని తెలిపారు. శనివారం 75001-92000 ర్యాంకుల వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయూ డిగ్రీ, పీజీ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 31: ఎస్వీయూ పరిధిలో నిర్వహించే డిగ్రీ రెండు, నాల్గవ సెమిస్టర్ల పరీక్షలు జూన్ 12వ తేదీ నుంచి జూలై 2 వరకు జరుగుతాయి. అదేవిధంగా పీజీ రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు నోటిఫికేషన్ విడుదలైంది. సంబంధిత వివరాలకోసం ఆయా ప్రిన్సిపాల్స్ కార్యాలయాల్లో సంప్రదించాలని సీఈ దామ్లా నాయక్ పేర్కొన్నారు.

చంద్రగిరి

మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో అన్నదానం



చంద్రగిరి, మే 31: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం చంద్రగిరి రెడ్డి వీధికి చెందిన టీడీపీ నాయకులు కాపువీధి తులసిరామ్‌రెడ్డి, సునీల్ రెడ్డిలు తన తండ్రి చెంగల్రాయరెడ్డి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలను ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, బోర్డు సభ్యులు సత్కరించారు.

ఉద్యాన పంటలపై అవగాహన



ఉద్యాన ప్రదర్శనలో డీహెచ్‌వో దశరథరామిరెడ్డి

చంద్రగిరి, మే 31: మండలంలోని శానంబట్లలో శుక్రవారం ఉద్యాన పంటలపై ప్రదర్శన ఏర్పాటు చేసి, గ్రామస్తులకు పంటలపై అవగాహన కల్పించారు. రాబోయే కాలంలో ఉద్యాన, వ్యవసాయ పంటలపైనే మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని జిల్లా హార్టికల్చర్ అధికారి దశరథరామిరెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా అనంతరాజుపేటలోని వైఎస్ఆర్ హార్టికల్చర్ కళాశాల విద్యార్థులు, తిరుపతి సిట్రస్ రీసెర్చ్ సెంటర్ విద్యార్థుల ఆధ్వర్యంలో శానంబట్లలో రైతు సదస్సు నిర్వహించారు. మేలైన దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు, అధికారులు సూచనలు, సలహాలు పాటించాలన్నారు. సిట్రస్ శాస్త్రవేత్త నాగరాజు, కవిత, శ్రీనివాసులురెడ్డి, చంద్రగిరి హెచ్‌వో శైలజ, ఉద్యాన అధ్యాపకులు జయప్రద, రమ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకి సన్మానం



భాకరాపేట, మే 31: చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో దేవేంద్రబాబు శుక్రవారం పదవీవిరమణ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. వివిధ మండలాల్లో పనిచేసి, రెండేళ్ల కిందట చిన్నగొట్టిగల్లుకు వచ్చారు. తుడా నిధులతో మంజూరైన పనులు త్వరగా పూర్తికావడానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేపట్టాలి



వడ్డికాల్వ పనులను తనిఖీ చేస్తున్న పీడీ

రామచంద్రాపురం, మే 31: ఉపాధి పనులను నాణ్యతగా చేపట్టాలని సంచాలకుడు శ్రీనివాసప్రసాద్ కోరారు. మండలంలోని కుప్పంబాదూరు, రాయలచెరువుపేట వడ్డికాల్వ వద్ద ఉపాధిపనులను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యేలా పనులు చూపించాలన్నారు. వేసవి నేపథ్యంలో పనుల వద్ద కూలీలకు షెడ్, తాగునీటి వసతి కల్పించాలన్నారు. ఈ తనిఖీల్లో ఏపీవో హంసవేణి, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయమాణిక్యంలో శాంతి సమావేశం

ఎర్రావారిపాలెం, మే 31: భాకరాపేట పోలీసులు శుక్రవారం ఉదయమాణిక్యం గ్రామంలో ప్రజలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈనెల 5వ తేది వరకు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ మస్తాన్‌వలి, ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు. 4న ఎటువంటి ర్యాలీలు, బాణసంచా కాల్చడం, ఇతరులను రెచ్చగొట్టేలా ప్రవర్తించడం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఘర్షణలకు దిగి అనవసరంగా కేసుల్లో ఇరుక్కోవద్దని తెలిపారు.

అత్యాచార కేసులో నిందితుల అరెస్ట్

సూళ్లూరుపేట, మే 31: ప్రియుడిని నిర్బంధించి యువతిని అత్యాచారం చేసిన కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం శ్రీహరికోట పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ మధుబాబు తెలిపిన వివరాలు... ఈనెల 29న తీర ప్రాంత గ్రామ పొలాల్లోకి ఓ యువతి సహా ఆమె ప్రియుడి ని తడకు చెందిన ఏళుమల్లై, బాలాజి మాయమాటలు చెప్పి తీసు కెళ్లారు.అక్కడికి వెళ్లిన తరువాత ప్రియుడిని నిర్బంధించి ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శ్రీహరికోట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీవారిమెట్టు మార్గంలో నేడు హనుమజ్జయంతి

చంద్రగిరి, మే 31: శ్రీవారిమెట్టు మార్గంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి నిర్వహించనున్నారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామివారికి అభిషేకం, 7 నుంచి 8 గంటల వరకు స్వామివారికి విశేషాలంకరణ, 8 గంటల నుంచి సప్త హారతులు, నైవేద్యం, 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ప్రాకారోత్సవం నిర్వహిస్తారు.

పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ

చంద్రగిరి, మే 31: పరిసరాలు పరిశుభ్రతతోనే దోమలను నివారించవచ్చని మలేరియా నివారణాధికారి రూప్‌కుమార్ అన్నారు. శుక్రవారం చంద్రగిరిలోని బీడీ వర్కర్స్ కాలనీని సందర్శించి మురుగు కాలువలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. వైద్య సిబ్బంది శివయ్య, ఈశ్వరయ్య, సిరాజుద్దీన్, శ్యామల, వాసుదేవ, వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యంతోనే పొగాకు నియంత్రణ

రామచంద్రాపురం, మే 31: సామాజిక చైతన్యంతోనే పొగాకు నియంత్రణ సాధ్యమని సీకేఎస్ తేజ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీషారావు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని వెంకట్రామపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మశీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.నిరంజన్‌బాబు, ప్రొఫెసర్ శరవణకుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై బైండోవర్ కేసులు

రేణిగుంట, మే 31: టీడీపీ నాయకులపై రేణిగుంట అర్బన్ పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. శుక్రవారం టీడీపీ పట్టణాధ్యక్షుడు మెహబూబ్‌బాషా, మాజీ సర్పంచు భాస్కర్ యాదవ్‌పై బైండోవర్ కేసులు నమోదు చేశారు. కాగా, ఇప్పటి వరకు వైసీపీ నాయకులపై కేసులు నమోదు చేయలేదు. పోలీస్‌స్టేషన్‌కు రావాలని వైసీపీ నాయకులను పోలీసులు పిలుస్తున్నా స్పందించడంలేదని సమాచారం.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), మే 31: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు చెన్నైకు చెందిన శ్రీనివాస్ శుక్రవారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతకు సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

బాలికను మోసం చేసిన యువకుడి అరెస్టు

చౌడేపల్లె, మే31: ప్రేమపేరుతో యువతిని మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. మండలానికి చెందిన ఆనంద్ అనే యువకుడు ఓ బాలికకు ప్రేమపేరుతో నమ్మించాడు. ప్రస్తుతం పెళ్లి చేసుకోనని బాలికను మోసం చేశాడు. దీంతో ఆ బాలిక గతనెల 15న ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఈ క్రమంలో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. యుకుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

రుయాలో కానరాని ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలు

రోగుల సహాయకులకు తప్పని తిప్పలు



రోగులను చేతులపై ఒకరు, వీల్‌చైర్‌పై మరొకరు తీసుకెళుతున్న సహాయకులు - స్ట్రెచర్‌పై రోగిని అత్యవసర విభాగంలోకి తీసుకెళుతున్న సహాయకులు

తిరుపతి(వైద్యం), మే 31: అంబులెన్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో వైద్యం కోసం అత్యవసర విభాగానికి వచ్చే రోగులను తక్షణమే వాహనాల్లో నుంచి దింపుకొని వీల్ చైర్లు, స్ట్రెచర్లపై అత్యవసర విభాగంలోకి తీసుకువెళ్లాల్సిన ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు డీఈవోలుగా, ఓటీ సహాయకులుగా స్థిరపడిపోవడంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్న దుస్థితి రుయాస్పత్రిలో నెలకొంది. రోగులకు సేవలందించేందుకు సాధారణంగా ఆస్పత్రిలో 145 మంది ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు ఉండాలి. కానీ కేవలం 67 మంది మాత్రమే అందుబాటులో ఉండగా, మిగిలిన 78 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న 67 మందిలో రోజూ 20 మందికిపైగా సెలవుల్లో ఉండటం, మరో 10 మందిని డీఈవో, ఓటీ సహాయకులుగా సర్దుబాటు చేయడంతో కేవలం 37 మంది మాత్రమే విధుల్లో ఉంటున్నారు. వీరు దాదాపు 3వేల మందికిపైగా రోగులకు సేవలు అందించాల్సి వస్తోంది. రోగులను వారి సహాయకులే అతి కష్టం మీద చేతులపై లేదా వీల్ చైర్లు, స్ట్రెచర్లపై అత్యవసర విభాగంలోకి తీసుకువెళ్లాల్సి వస్తుంది. దీంతో రోగులకు అత్యవసర వైద్యం అందడం ఆలస్యమవడంతోపాటు రోగుల సహాయకులకు తిప్పలు తప్పడం లేదు. ఉన్న అరకొర ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలు కూడా రోగికి సాయం చేయాలంటే చేయి తడపనిదే ముందుకు రావడంలేదనే విమర్శలు ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు పరిశీలించి రోగులకు అందుబాటులో సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

3న తలకోనలో షాపులకు వేలం

ఎర్రావారిపాలెం, మే 31: తలకోనలో జూన్ 3న గదుల వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో జయకుమార్ తెలిపారు. శాశ్వత అంగళ్లు 2, 3 గదులకు ఆలయ పాలన కార్యాలయంలో ఈనెల 3వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే వేలంలో రూ.5వేల ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చని ఈవో తెలిపారు. గదులు దక్కించుకున్న వారు అప్పుడే 3 నెలల అద్దె చెలించాల్సి ఉంటుందని తెలిపారు వివరాలకు 97010 00002 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

కారు బీభత్సం

గూడూరు అర్బన్, మే 31: మద్యంమత్తులో యువకుడు కారును అతివేగంగా నడిపి బీభత్సం సృష్టించాడు. ఈ ఘటన గురువారం రాత్రి పట్టణంలో జరిగింది. నాయుడుపేటలోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న ఆకాష్ కారులో గూడూరు రైల్వేస్టేషన్‌లో అతని స్నేహితుడిని దిం పాడు. అక్కడినుంచి అతివేగంగా ఆసుపత్రిరోడ్డు, సంఘం థియేటర్ మీదుగా శివాలయంవీధిలో కారును నడపడంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. శివాలయం వీధిలోని ఓ స్పీడ్‌బ్రేకర్‌ను కారు ఢీకొని నిలిచిపోయింది. దీంతో స్థానికులు ఆకాష్‌కు దేహశుద్ధి చేసి ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించారు. పట్టణ సీఐ పాపారావు డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి మృతి

వి.కోట, మే 31: వి.కోట మండలం దాసార్లపల్లెకు చెందిన నల్లప్ప కుమారుడు శ్రీనివాసులు(48) చెరువులో పడి మృతిచెందాడు. శుక్రవారం ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో చెరువు వద్ద అతని దస్తులు కనిపించాయి. చెరువులో గాలించగా అతని మృతదేహం కనిపించింది. పోలీసు లు చెరువు వద్దకు చేరుకుని మృత దేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆస్పత్రికి తరలించారు. చేపల కోసం వెళ్లి మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. భార్య సరసమ్మ ఫిర్యాదు మేరకు సీఐ లింగప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడిపై ఫిర్యాదు : వైసీపీ నాయకులపై కేసు

నాయుడుపేట టౌన్, మే 31: పట్టణంలో నివాసం ఉంటున్న తమ ఇంటిపై వైసీపీ నాయకుడు కె.అశోక్ కుటుంబసభ్యులు, మరో ముగ్గురు దాడి చేసినట్లు అదే పార్టీకి చెందిన పి.రాజేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం జరిగిన జాతరలో అమ్మవారి ఊరేగింపు సందర్భంగా ఇరువర్గాల మధ్య తలెత్తిన మనస్పర్థలను మనస్సులో పెట్టుకొని అదేరోజు అర్ధరాత్రి అశోక్ తన కుటుంబసభ్యులు, మరో ముగ్గురితో కలిసి తమ ఇంటికి చేరుకుని సీసీ కెమెరాలను, కిటికీ అద్దాలను పగలగొట్టి తలుపుతీయాలంటూ నానారభస సృష్టించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. సమాచారం అందుకుని అక్కడికి పోలీసులు చేరుకునేలోగా అశోక్ కుటుంబసభ్యులు పరారయ్యార న్నారు. రాజేష్ ఫిర్యాదు మేరకు అశోక్ కుటుంబసభ్యులు, శ్రీకాంత్, సాయి, వంశీపై పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి, మే 31: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని... ఉరేసుకున్న భర్త



గణేష్ మృతదేహం

తడ, మే 31: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మన స్థాపంతో యువకుడు ఉరేసుకున్నాడు. చెన్నై నగరం మన్నాడ్‌కు చెందిన గణేష్ (21)కు పూడి గ్రామానికి చెందిన మహిళతో రెండేళ్ల క్రితం వివాహమైంది. అప్పటినుంచి గణేష్ అత్తగారి ఇంటికి వచ్చి వెళ్తుంటాడు. కొద్దిరోజులుగా పూడిలోని ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. మనస్పర్థల కారణంతో వారంరోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన గణేష్ గురువారం రాత్రి సమయంలో తాను పనిచేసే దుకాణంలోనే ఉరి వేసుకున్నాడు. శుక్రవారం ఉదయం షాపుకు వచ్చిన యజమాని గణేషు ఉరేసుకున్న విషయాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటిగుంటలో పడి యువకుడి మృతి

చిల్లకూరు, మే 31: మండలంలోని ఏరూరులో శుక్రవారం గ్రామానికి సమీపంలోని నీటిగుంటలో పడి వ్యక్తి యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్(30) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిగుంటలో పడి ఇరుక్కుపోయి మృతి చెందాడు. బహిర్భూమికి వెళ్లిన మనోజ్‌కుమార్ ఎంతసేపటికీ ఇంటికి రావకపోవడంతో కుటుంబసభ్యులు గాలించగా నీటిగుంటలో తేలుతుండడాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హుండీ కానుకలు తస్కరించిన అప్రైజరు అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్, ఉంగరం, నగదు

ఐరాల(కాణిపాకం), మే 31: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ లెక్కింపులో చేతివాటం చూపిన అప్రైజర్ ప్రకాష్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు చిత్తూరు వెస్టు సీఐ రవిశంకర్ రెడ్డి, కాణిపాకం ఎస్‌ఐ రామ్మోహన్ శుక్రవారం తెలిపారు. గురువారం హుండీ కానుకల లెక్కింపు సందర్భంగా వంద గ్రాముల బంగారు బిస్కెట్, ఒకటిన్నర గ్రాముల ఉంగరం, రూ.ఐదు వందలను అప్రైజరు తస్కరించినట్లు వారు చెప్పారు. ఆలయ ఏఈవో హరిమాధవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచామన్నారు.



షాపు వెనుక గదిలోని గోడౌన్‌లో స్టాకున్న మద్యం



ఎలైట్ మద్యం దుకాణం తెరిచిన అరగంటకే ఖాళీగా ర్యాకులు



చిత్తూరులోని ఎలైట్ మద్యం దుకాణంలో ధరలుండే స్టిక్కర్లను జేబుల్లో దాచేసి ముఖాలకు చేతుల్ని అడ్డుపెట్టుకుంటున్న సిబ్బంది

వచ్చిన మద్యం వచ్చినట్లే..!

దుకాణాల నుంచి వైసీపీ నేతలకు మళ్లింపు

- మద్యం అందుబాటులో లేక మందుబాబుల ఆగ్రహం
- పోలింగ్ సమయంలోనూ ఇలానే

కౌంటింగ్ కోసం అన్ని షాపుల్ని ఖాళీ చేస్తున్న వైనం

ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. కర్ణాటక నుంచి భారీగా మద్యం తెచ్చుకోవాలంటే నాయకులకు ఇబ్బందిగా మారింది. తనిఖీల్లో పట్టుబడితే అధికారులు సీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ నాయకులు జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల మీద కన్నేశారు. ఆయా దుకాణాలకు వచ్చిన స్టాకును వచ్చినట్లు వైసీపీ నేతలకు చేరిపోయింది. ఎలైట్ షోరూమ్‌లోనూ వెనుక గోడౌనులో మద్యం స్టాకు ఉంచి.. షాపులో నామమాత్రంగా బాటిళ్లు పెట్టి మందుబాబులకు అమ్మారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల్లో తనిఖీల కారణంగా గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి జిల్లాలో మద్యం విచ్చలవిడిగా కనిపించలేదు. అధికార పార్టీ నాయకులు తమ పలుకుబడితో కొన్ని నియోజకవర్గాల్లో మద్యం పంపిణీ చేసినా.. ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థులు మాత్రం ఎక్కడా చెప్పుకోదగ్గ స్థాయిలో మద్యాన్ని పంపిణీ చేయలేదు. పోలింగ్‌కు కొన్నాళ్ల ముందు నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో స్టాకు లేకుండా పోయింది. ఎందుకంటే రోజువారీ స్టాకును ఎప్పటికప్పుడు అధికార పార్టీ నాయకులు తీసేసుకున్నారు. జిల్లా కేంద్రం చిత్తూరులో ఇలా మద్యం షాపులన్నీ ఖాళీ అయిపోయేవి. తాజాగా జూన్ 4న కౌంటింగ్ నేపథ్యంలోనూ వైసీపీ నాయకులు ఇలాగే చేస్తున్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఘర్షణలకు తావివ్వకుండా జూన్ 3, 4, 5 తేదీల్లో మద్యం దుకాణాల్ని బంద్ చేస్తున్నట్లు డీజీపీ ఆదేశించగా.. వైసీపీ నాయకులు ముందస్తుగా మద్యం దుకాణాల్ని ఖాళీ చేస్తున్నారు. చిత్తూరులో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎలైట్ షోరూమ్‌ను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. ఉదయం 11 గంటల ప్రాంతంలో దుకాణాన్ని మూసేసి సిబ్బంది లోపల పనులు చేసుకుంటున్నారు. మద్యం బాటిళ్లపై ధరను సూచిస్తూ ఉండే స్టిక్కర్లను వందకుపైగా పెట్టుకుని స్కాన్ చేసుకుంటున్నారు. 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు లోపలకు వెళ్లగా.. ఆ స్టిక్కర్లను జేబుల్లో దాచి పెట్టుకుని, సిబ్బంది ముఖాలకు చేతుల్ని అడ్డు పెట్టుకున్నారు. 11.30 గంటలకు షాపు తెరవగా.. లోపల మద్యం బాటిళ్లు పెద్దగా లేవు. ఉన్నవే తీసుకుని మందుబాబులు క్యూలో నిలబడి డబ్బులు చెల్లించి తీసుకెళ్లారు. దుకాణంలోనే వెనుక గదిలోని గోడౌన్‌లో మద్యం ఫుల్ స్టాక్ ఉంది. కానీ, సిబ్బంది దాన్ని మాత్రం షాపులో ఉంచకుండా దాచి పెట్టారు. తమ నిర్వాకం తెలిసిపోతుందని భావించిన అక్కడి సిబ్బంది.. ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫరుపై చిర్రుబుర్రులాడారు.

\- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



నచ్చిన మద్యం లేకపోవడంతో ఏదో ఒక బ్రాండు తీసుకుని డబ్బు చెల్లించేందుకు క్యూలో నిలబడ్డ మందుబాబులు

డ్రంక్ డ్రైవ్ కేసులో 14మందికి జరిమానా

తిరుపతి(లీగల్): మద్యంతాగి వాహనాలు నడిపిన 14మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ 4వ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు వెలువరించారు. వీరిని కానిస్టేబుల్ గిరిబాబు కోర్టులో హాజరుపరిచారు.

పొగాకు ఉత్పత్తులతో జీవితాలు నాశనం




మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీకుమార్, రన్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో, వైద్యులు, నగరవాసులు

తిరుపతి(వైద్యం), మే 31: పొగాకు ఉత్పత్తులను వాడటం వలన ఆరోగ్యంతోపాటు జీవితాలు నాశనమవుతాయని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీకుమార్ పేర్కొన్నారు. స్విమ్స్‌లో మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ అల్లాడి మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పొగాకు ఉత్పత్తుల వలన నష్టాలు, వాటి నుంచి బయట పడాలంటే పాటించాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీడీ ప్రభావతి, ఏడీ రాజశేఖర్ డాక్టర్లు హరికృష్ణ, మనోలాస్య, సమీరజ, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణాద్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో 4కే రన్

తిరుపతి(కలెక్టరేట్) : పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సునందకుమార్ రెడ్డి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో కులశేఖర్ అళ్వార్‌పడిరోడ్డు నుంచి తిమ్మినాయుడుపాళెం వరకు 4కే రన్ నిర్వహించారు. సునందకుమార్‌రెడ్డి, సీఈవో డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలు అధికమని చెప్పారు. డీపీఎంవో శ్రీనివాసులు, డాక్టర్ పద్మావతి, డాక్టర్ ప్రియదర్శిని, మాస్ మీడియా అధికారి బాబు నెహ్రూరెడ్డి, ఎన్టీసీపీ ఆఫీసర్ అరుణ, మౌనిక, ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోవిందా.. ఏమిటీ ఎండ..!

భానుడి ప్రతాపానికి శ్రీవారి భక్తుల పరుగులు




మండుతున్న నేలపై భక్తుల పరుగులు

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులపై భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచే తిరుమలలో వేడి మొదలైంది. సాయంత్రమైనా ఏమాత్రం ఎండ తీవ్రత తగ్గకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాధారణంగా తిరుమలలో శ్రీవారి ఆలయం ముందు, నాలుగు మాడవీధుల్లో పాదరక్షలతో తిరగడం నిషేధం. స్వామి దర్శనానికి వచ్చిన భక్తుల్లో చాలా మంది కూడా పవిత్రతను దృష్టిలో పెట్టుకుని ఇతర ప్రాంతాల్లోనూ పాదరక్షలు వినియోగించరు. ఈక్రమంలో కాలుతున్న నేలపై నడవలేక భక్తులు పరుగులు తీస్తూ కనిపించారు. కొంతమంది చిన్నారులైతే కాళ్లు మండిపోవడంతో రోదిస్తూ పరుగులు తీశారు. చంటిబిడ్డలతో వచ్చిన తల్లిదండ్రులతో పాటు వృద్ధులు తమ వద్దనున్న వస్త్రాలను కప్పుకుని వెళ్లాల్సిన పరిస్థితి కనిపించింది. తిరుమలలో కూడా ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో శుక్రవారం భక్తులు ఏసీ గదులు తీసుకునేందుకు క్యూలైన్లలో బారులు తీరారు. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు స్వామి పుష్కరిణిలోనూ భక్తులు అధిక సమయం గడిపారు. టీటీడీ కూడా తరచుగా నేలను నీటితో చల్లబరిచినప్పటికీ తీవ్రమైన ఎండతో ఆవిరైపోయాయి.



కుళాయి ద్వారా దాహార్తిని తీర్చుకుంటున్న వానరం

పోలీస్‌స్టేషన్‌కి ఎక్కిన రుయా పరువు

సీఎస్ ఆర్ఎంవో, బయోకెమిస్ట్రీ ల్యాబ్ ఉద్యోగుల పరస్పర ఫిర్యాదులు

తిరుపతి(వైద్యం), మే 31: రుయాలో ఉద్యోగులకూ ఒక అధికారికీ నడుమ రేగిన వివాదం పోలీస్‌స్టేషన్ దాకా వెళ్లింది. బయోకెమిస్ట్రీ విభాగం ఉద్యోగులు సురేష్‌బాబు, గిరిబాబు తనను కులం పేరుతో దూషించారని, దౌర్జన్యం చేశారని సివిల్ సర్జన్ ఆర్ఎంవో లక్ష్మానాయక్ వెస్ట్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ల్యాబ్ కిట్ల కోసం వెళ్లిన మహిళా ఉద్యోగిని అసభ్య పదజాలంతో ఆర్ఎంవో లక్ష్మానాయక్ దూషించారని, దీనిని ప్రశ్నించిన తమపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని బెదిరించారని ఉద్యోగులు సురేష్‌బాబు, గిరిబాబు, శ్రీదేవి మరొక ఫిర్యాదు వెస్ట్ పోలీసులకు ఇచ్చారు. ఎస్వీ వైద్య కళాశాలకు అనుసంధానంగా ఉన్న ల్యాబ్‌కు అవసరమైన పరికరాల కోసం ఇండెంట్‌తో వచ్చిన కాంట్రాక్ట్ ఉద్యోగిని సీఎస్ ఆర్ఎంవో తిప్పి పంపడంతో వివాదం మొదలైందని తెలిసింది. దీనిపై ఏపీఎన్జీవో నేత సురేష్, ఏఐటీయూసీ నేత గిరిబాబు మహిళా ఉద్యోగితో కలిసి వెళ్లి ఆర్ఎంవోను ప్రశ్నించారు. ఆయనతో వాగ్వాదానికి దిగారు. మాటా మాటా పెరగడంతో కేసుల దాకా వెళ్లినట్టు సమాచారం. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు ఈ విషయంపై రుయాస్పత్రిలో విచారణ చేపట్టారు.



సీఎస్ఆర్ఎంవో లక్ష్మానాయక్‌తో ఉద్యోగ సంఘాల నేతల వాగ్వాదం

చెక్కు బౌన్స్ కేసు

● నెల రోజుల్లో పరిహారం చెల్లించాలని ఆదేశం

తిరుపతి(లీగల్), మే 31: చెక్కు బౌన్స్ కేసులో తిరుచానూరు రోడ్డు శ్రీనివాసపురానికి చెందిన వి.వి.ఆర్.కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన వి.వెంకటరమణారెడ్డి నెల రోజుల్లోగా రూ.14,95,000 నష్టపరిహారం చెల్లించాలని, కట్టనిపక్షంలో ఏడాది జైలుశిక్షకు ఆదేశిస్తూ ఆరవ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి ఎం.విజయచంద్ర రాణా శుక్రవారం తీర్పు చెప్పారు. ఆర్సీ రోడ్డు తుడా ప్లాట్స్‌లో జి.ఎస్.ఆర్ అసోసియేట్స్‌కు చెందిన ప్రొప్రైటర్ షేక్ నజీనబేగం వద్ద 2018 నవంబరు 5న వి.వెంకటరమణారెడ్డి శానిటరీ మెటీరియల్, పీవీసీ పైపులు రూ.10లక్షలకు కొనుగోలు చేసి చెక్కు చెల్లించాడు. చెక్కు బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ కావడంతో షేక్‌నజీనబేగం కోర్టును ఆశ్రయించింది. సాక్ష్యాధారాలు నిరూపణకావడంతో న్యాయమూర్తి ఆ సొమ్మును నెలలోపు చెల్లించాలని ఆదేశించారు.

ఏడాది జైలు శిక్ష

చెక్కు బౌన్స్ కేసులో తిరుపతి వరదరాజనగర్ తపాలావీధికి చెందిన జి.ఎస్.కుమారికి ఏడాది జైలు శిక్ష, రూ.10లక్షలు జరిమానా విధిస్తూ ఒకటవ అదనపు కోర్టు న్యాయమూర్తి సత్యక్రాంత్‌కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. తిరుపతి యాదవకాలనీకి చెందిన న్యాయవాది సి.ఎస్.చంద్రశేఖర్ వద్ద రూ.10లక్షలు జి.ఎస్.కుమారి అప్పుగా తీసుకున్నారు. అప్పు చెల్లించే క్రమంలో ఇచ్చిన చెక్కు బౌన్స్ కావడంతో బాధితుడు తిరుపతి కోర్టును ఆశ్రయించారు. కేసు నిరూపణ కావడంతో న్యాయమూర్తి జైలుశిక్షతోపాటు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండునెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రేపే లాసెట్ మోడల్ ఎగ్జామ్

తిరుపతి(లీగల్), మే 31: తిరుపతి యూత్‌హాస్టల్లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి 11.30వరకు లాసెట్ మోడల్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరుజిల్లా బీసీ న్యాయవాదుల సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.సుబ్రహ్మణ్యంయాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9949657167 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను టీటీడీ గురువారం లెక్కించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. గురువారం 64,115మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 32,711 మంది తలనీలాలు సమర్పించారు.

డి-ఫార్మసీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మే 31: రెండేళ్ల డి-ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వై.ద్వారకానాథరెడ్డి తెలిపారు. బైపీసీ, ఎంపీసీ విభాగాల్లో రెగ్యులర్‌గా కానీ, ఓపెన్ విధానంలో ఇంటర్మీడియట్ చదివినవారు డి-ఫార్మసీ కోర్సులో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ఔత్సాహికులు హెచ్‌టీపీఎస్//ఏపీఎస్‌బీటీఈటీ.ఇన్/పీహెచ్‌ఏఆర్ఎంఏసీపై వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బియ్యం కార్డు, ఆరు నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో దరఖాస్తుకు అవసరమని, ఆన్‌లైన్ దరఖాస్తు తర్వాత దాన్ని ప్రింట్ తీసి కళాశాలలో సమర్పించాలని తెలిపారు. జూన్ 15వ తేదీ దరఖాస్తుకు చివరి తేదీ కాగా, ఇతర సమాచారానికి 70367 25872, 99088 57585, 99667 61446 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అమిత్ షాకు పోట్రెట్ ఆర్ట్ బహూకరణ



తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్ షాకు ఓ కళాకారుడు పోట్రెట్ ఆర్ట్‌ను బహూకరించారు. ఆదిలాబాద్ జిల్లాలోని పెంచ కలపేట్‌కు చెందిన మారుతి పోట్రెట్ ఆర్టిస్ట్. తిరుమలకు వచ్చే భక్తుల బొమ్మలు గీస్తూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీవారి దర్శనార్థం వచ్చిన అమిత్ షా బొమ్మను గీసిన మారుతి శుక్రవారం ఉదయం అతిథిగృహం వద్ద అమిత్ షాకు బహూకరించాడు. అమిత్ షా కూడా తన చిత్రాన్ని చూసి మారుతిని అభినందించారు.

తిరుపతి గంగమ్మ మహత్యం పుస్తకావిష్కరణ



తిరుపతి (కల్చరల్) మే 31: రంగస్థలి పత్రిక సంపాదకులు కె.యన్. రాజ రచించిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ మహత్యం పుస్తకాన్ని శుక్రవారం సాయంత్రం కపిలతీర్థం రోడ్డులోని ఆనందరావు కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో శతావధాని భరత్ శర్మ ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని సీనియర్ పండితులు కప్పా పద్మనాభానికి అంకితమిచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఐక్యవేదిక అధ్యక్షులు కొత్తపల్లి మునిరత్నం, శంకరయ్య, అక్కిపల్లి మునికృష్ణయాదవ్, ఆమూరి సుబ్రహ్మణ్యం, పలువురు కళాకారులు పాల్గొని, రచయితను అభినందించారు.

సత్కారం



తిరుపతి(నేరవిభాగం), మే 31: బాలల సంరక్షణ రీజనల్ ఇన్‌స్పెక్టర్ దూపాటి సుబ్రహ్మణ్యంను శుక్రవారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. బాలల సంరక్షణ రిటైర్డు రీజనల్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ సుకుమార్, సీనియర్ రీజనల్ అధికారులు షణ్ముఖీరావు, సుధాకర్, త్రినాధరావు, నందలూరి ఎంఈఓ నాగయ్య పాల్గొన్నారు.

2న తుమ్మలగుంటలో క్రికెట్ ఎంపికలు

తిరుపతి రూరల్, మే 31: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని వైఎస్సార్ క్రీడామైదానంలో చిత్తూరు జిల్లా బాలుర, బాలికల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-23(పురుషులు), అండర్-16(బాలురు) విభాగంలో ఈనెల 2న సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. 2008 సెప్టెంబరు 1నుంచి 2010 ఆగస్టు 31 మధ్య జన్మించినవారు అండర్-16 విభాగానికి, 2001 సెప్టెంబరు 1నుంచి 2010 ఆగస్టు 31 మధ్య జన్మించినవారు అండర్-23 విభాగంలో నిర్వహించే ఎంపికలకు అర్హులని వివరించారు. వివరాల కోసం 98490 26131(మురుగన్), 79818 80381(చిన్నబాబు) నెంబర్లని సంప్రదించాలని కోరారు.

రుయా మార్చురికీ అనాథ శవం తరలింపు



తిరుపతి(వైద్యం), మే 31: రుయాస్పత్రి ఆవరణలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్ రుయా మార్చురీకి తరలించారు. రుయా అత్యవసర విభాగం సమీపంలోని రోగుల సహాయకుల షెల్టర్‌లో ఓ వ్యక్తి గురువారం అర్ధరాత్రి నుంచి మృతిచెంది పడి ఉండటాన్ని సిబ్బంది కొందరు గుర్తించి హెల్త్ సూపర్‌వైజరు ప్రకాష్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన వెంటనే ఆ మృతదేహాన్ని పరిశీలించి, అక్కడి వారి నుంచి వివరాలు ఆరా తీశారు. ఆయన గత కొంత కాలంగా ఇక్కడే పడి ఉన్నాడని తెలియడంతో గుర్తు తెలియని వ్యక్తిగా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం ఆ మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు.

వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా శ్రీలత

తిరుపతి రూరల్, మే 31: తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ తాత్కాలిక డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా ప్రొద్దుటూరులోని వెటర్నరీ సైన్స్ కళాశాల పాథాలజీ విభాగ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలతని నియమిస్తూ వర్సిటీ వీసీ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు డీఆర్‌గా ఉన్న ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు పదవీకాలం శుక్రవారంతో ముగియడంతో.. శ్రీలతని తాత్కాలిక డీఆర్‌గా నియమించారు. దాంతో శ్రీలత ఆ బాధ్యత చేపట్టారు. కాగా ప్రభుత్వం పెంచిన 65 సంవత్సరాల సర్వీసుకు హైకోర్టు ఇంటీరియమ్ ఆర్డర్‌తో సర్జన్‌రావుని ప్రొఫెసర్‌గా కొనసాగిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ అరుణాచలం రవి ఉత్తర్వులు వెలువరించారు. ఎన్నికలకోడ్ అమలులో ఉండటంతో ప్రొఫెసర్ శ్రీలత నియామకంపై ఏపీ ఎన్నికల కమిషన్ అధికారి (సీఈవో) అనుమతి తీసుకున్నారా అన్న అంశంపై రిజిస్ట్రార్‌ని వివరణ కోరగా.. 6నెలల కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన నియమించామని, వర్సిటీ పాలకమండలిలో పెట్టి రాటిఫికేషన్ తీసుకుంటామని వివరించారు.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పి జీపు బోల్తా

భక్తులకు స్వల్పగాయాలు



తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్‌లో శుక్రవారం ఓ జీపు బోల్తాపడింది. ఏపీ 03 వీ 7155 నెంబరు గల జీపులో ఆరుగురు భక్తులు శుక్రవారం మధ్యాహ్నం తిరుమలకు బయలుదేరారు. మార్గంలోని 7వ కిలోమీటరు మలుపు వద్ద జీపు ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తాపడింది. అదృష్టవశాత్తు జీపులోని భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అనంతరం టీటీడీ ఆటోక్లినిక్ సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రమాదం జరగడానికి గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు.

పదవీ విరమణ సన్మానం



తిరుపతి(నేరవిభాగం), మే 31: జిల్లా పరిధిలో శుక్రవారం 11 మంది పోలీసు అధికారులు పదవీ విరమణ పొందారు. డీఎస్పీలు కాటమరాజు, నరసప్ప, సీఐ చంద్రశేఖర పిళ్లై, ఏఎస్ఐ దామోదరరెడ్డి, కోదండయ్య, విజయకుమార్ రాజు, జయప్రసాద్ బాబు, ఆనందకుమార్, హేమసుందర నాయుడు, వేణుగోపాల్, హెడ్ కానిస్టేబుల్ జగన్నాధంలను పోలీసు శాఖ తరఫున నగరంలోని ఒక ఫంక్షన్ హాలులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ హర్షవర్ధన రాజు ఘనంగా సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ మీ సేవలు మరువరానివని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, వెంకట్రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఏవో ఉద్యోగ విరమణ



రవిశంకర్‌ను సన్మానిస్తున్న చెంచుబాబు

మంగళం, మే 31: తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించే ఎన్.రవిశంకర్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పదవీ విరమణసభకు ముఖ్యఅతిథిగా డీఎస్పీ చెంచుబాబు హాజరై రవిశంకర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఏసీఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్వోలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

తిరుచ్చిపై అలమేలు అభయం



తిరుచానూరు, మే 31: తిరుచానూరులోని అలమేలు మంగమ్మ బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం అర్చకులు మూలమూర్తికి అభిషేకం నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ భక్తుల గోవిందనమస్మరణల మధ్య నేత్రపర్వంగా జరిగింది. ఇక మధ్యాహ్నం అమ్మవారిని ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి సుగంధపరిమళ ద్రవ్యాలతో తిరుమంజనం జరిగింది. సర్వఅలంకార శోభితురాలైన అమ్మవారికి శుక్రవారం రాత్రి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, చంద్రశేఖర్, టెంపుల్‌ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిస్కం అభివృద్ధికి అధికారుల సేవలు అమూల్యం

సీఎండీ సంతోషరావు



పదవీ విరమణ చేసిన అధికారులను సన్మానిస్తున్న సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), మే 31: సదరన్ డిస్కం పరిధిలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో అధికారుల కృషి అమూల్యమని ఆ సంస్థ సీఎండీ కె.సంతోషరావు పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలోని సమావేశమందిరంలో సీజీఎంలుగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన డి.వెంకటచలపతి, కె.గురవయ్య, పీవీ లక్ష్మీప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథి సీఎండీ సంతోషరావు, విశిష్ట అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్‌లు పదవి విరమణ చేసిన అధికారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈకార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వై.లక్ష్మీనరసయ్య, కె.శివప్రసాద్‌రెడ్డి, సీజీఎంలు జె.రమణాదేవి, పి.అయూబ్ ఖాన్, కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, వరకుమార్, ఆదిశేషయ్య, జానకిరామ్, సలహాదారు వీఎన్ బాబు, ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి, ఈఈలు వాసుదేవరెడ్డి, వాసురెడ్డి, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

టాస్క్‌ఫోర్సు కార్యాలయం వద్ద అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మంగళం, మే 31: కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్సు కార్యాలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దీనిని గమనించిన టాస్క్‌ఫోర్సు సిబ్బంది, ఉన్నతాధికారులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా నిప్పంటించారా లేక సాధారణంగానే మంటలు చెలరేగాయా అనే దానిపై విచారణలో తేలాల్సి ఉందని అధికారులు చెప్పారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



శ్రీకాంత్ ఓదెల, డింపుల్ హయతి, శివదాస్ మీన

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి సిద్దా రాఘవయ్య, సినీ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, హీరోయిన్ డింపుల్ హయతి, తమిళనాడు చీఫ్ సెక్రటరీ శివదాస్ మీన, పుదుచ్చేరి ఎమ్మెల్యే చంద్ర ప్రియాంక, బిగ్‌బాస్ కంటెస్టెంట్ టేస్టీ తేజ, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రహ్మణ్యం, మధు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



కల్వర్టులో అశోక్ మృతదేహం

శ్రీకాళహస్తి, మే 31: రోడ్డు ప్రమాదంలో అశోక్(35) దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు... ఏర్పేడు మండలం పల్లం దళితవాడకు చెందిన అశోక్ విద్యుత్‌శాఖలో ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తుండేవాడు. శ్రీకాళహస్తి పట్టణంలో విధులు ముగించుకుని గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మండలంలోని అక్కుర్తి వద్ద రోడ్డుపై నిర్మాణ దశలో ఉన్న కల్వర్టును ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఢీకొంది. వాహనంతో సహా అశోక్ కల్వర్టులో పడిపోయాడు. ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ అజయ్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతుడు అశోక్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

పులివర్తి నానీకి టీడీపీ నాయకుల పరామర్శ



పులివర్తి నానీని పరామర్శిస్తున్న రాజేంద్ర తదితరులు

నాయుడుపేట, మే 31: చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని శుక్రవారం తిరుపతిలోని ఆయన స్వగృ హంలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.రాజేంద్ర, నాయకులు పరామర్శించారు. ఇటీవల వైసీపీ మూకల దాడిలో ఆయన గాయపడడంతో ఈ మేరకు పరామర్శించారు. చంద్రగిరి భారీ మెజార్టీతో టీడీపీ గెలుస్తుం దని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజేంద్ర వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిన్నారావు, నాయకులు చెంగయ్య, పవన్‌కుమార్, జెడ్డా తదితరులున్నారు.

వృక్ష సంపద అక్రమంగా నరికివేత



శ్రీనివాసపురం వద్ద రోడ్డుపై పడి ఉన్న మొద్దు

నాయుడుపేట, మే 31: వాల్టా చట్టం ఉల్టా అయ్యింది. నిబంధనలకు విరుద్ధంగా వృక్షసంపదను నరికి శుక్రవారం తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాసపురం రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షసంపదను అక్రమంగా నరికి ట్రాక్టర్లల్లో తరలిస్తున్నారు. చెట్లను నరకాలంటే వాల్టా చట్టం 2004 ప్రకారం మొదటగా తహసీల్దారుకు తెలియజేయాల్సి ఉంది. ఎటువంటి అనుమతులు లేకుండా బాహాటంగా చెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ... శ్రీనివాసపురంలో చెట్లు నరికివేతకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

చేయూత అనాథాశ్రమం తనిఖీ



పిల్లలతో మాట్లాడుతున్న డీఈవో

నాయుడుపేట, మే 31: పట్టణంలోని ఎల్‌ఏ సాగరంలోని చేయూత అనాథాశ్రమాన్ని తిరుపతి జిల్లా డీఈవో వి.శేఖర్ శుక్ర వారం తనిఖీ చేశారు. ఆశ్రయం పొందుతున్న పిల్లలతో మాట్లాడారు. అక్కడ కల్పిస్తున్న సదుపాయాలు, ఆహారం, విద్య, వసతులపై ఆరా తీశారు. తల్లిదండ్రులకు పిల్లలు ఏ విధంగా దూరమయ్యారో ఆశ్రమ నిర్వాహకుడు తొప్పాని కృష్ణను అడిగి తెలుసుకున్నారు. అలాగే నాయుడుపేటలో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్న జడ్పీ బాలుర, జడ్పీబాలికల, నారాయణ పాఠశాల కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎమ్మార్సీ శ్రీధర్‌బాబు, సీసీ కుమార్, మధు తదితరులు ఉన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని పూజలు



పూజల్లో చిరంజీవి కుటుంబీకులు

గూడూరు, మే 31: టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం కావాలని ఆకాంక్షిస్తూ దీక్షచేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నట్లు ఆ పార్టీ అభి మాని చిరంజీవి శుక్రవారం తెలిపాడు. పట్టణానికి చెందిన చిరంజీవి ఫిజియోథెరిపిస్టు. చిరంజీవి భార్య రేవతి గూడూరు నియోజకవర్గ తెలుగు మహిళా కార్యదర్శి. వీరి కుమారుడు అనిత్‌కుమార్ కూడా పలు బహిరంగ సభల్లో చంద్రబాబును, టీడీపీని పొగుడుతూ ప్రసంగాలు చేస్తూ టీడీపీ బుడ్డోడుగా పేరు తెచ్చుకున్నాడు. చంద్రబాబు సీఎం కావాలని గూడూరు ని యోజకవర్గంలో పాశం సునీల్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలవాలని 11 శుక్రవా రాలు ఉపవాసంతో జోన్నవాడ కామాక్షమ్మ దీక్షలు చేపట్టి ఈ శుక్రవారం మొకాళ్లపై అమ్మవారి ఆలయంలో ప్రదక్షణలు చేసినట్లు చిరంజీవి తెలిపారు.

పొగాకు ఉత్పత్తులు హానికరం



మాట్లాడుతున్న డాక్టర్ షరీనా

గూడూరు అర్బన్, మే 31: పొగాకు ఉత్పత్తులు వినియోగించడం ఆరోగ్యానికి హానికరమని ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ షరీనా అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా పొగాకు ఉత్పత్తుల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వలన శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్ సోకుతాయన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మధుసూదన్, ప్రియాంక, మోహన, సిబ్బంది గౌరీ, లలిత పాల్గొన్నారు.

డి-ఫార్మసీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మే 31: రెండేళ్ల డి-ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వై.ద్వారకానాథరెడ్డి తెలిపారు. బైపీసీ, ఎంపీసీ విభాగాల్లో రెగ్యులర్‌గా కానీ, ఓపెన్ విధానంలో ఇంటర్మీడియట్ చదివినవారు డి-ఫార్మసీ కోర్సులో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ఔత్సాహికులు హెచ్‌టీపీఎస్//ఏపీఎస్‌బీటీఈటీ.ఇన్/పీహెచ్‌ఏఆర్‌ఎంఏసీవై వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బియ్యం కార్డు, ఆరు నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో దరఖాస్తుకు అవసరమని, ఆన్‌లైన్ దరఖాస్తు తర్వాత దాన్ని ప్రింట్ తీసి కళాశాలలో సమర్పించాలని తెలిపారు. జూన్ 15వ తేదీ దరఖాస్తుకు చివరి తేదీ కాగా, ఇతర సమాచారానికి 70367 25872, 99088 57585, 99667 61446 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపే లాసెట్ మోడల్ ఎగ్జామ్

తిరుపతి(లీగల్), మే 31: తిరుపతి యూత్‌హాస్టల్లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి 11.30వరకు లాసెట్ మోడల్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరుజిల్లా బీసీ న్యాయవాదుల సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.సుబ్రహ్మణ్యంయాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 99496 57167 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. గురువారం 64,115 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 32,711 మంది తలనీలాలు సమర్పించారు.

రెండో ఘాట్‌లో అదుపుతప్పి జీపు బోల్తా

తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌లో శుక్రవారం ఓ జీపు బోల్తాపడింది. ఏపీ నెం.03 వీ7155 జీపులో అరుగురు భక్తులు శుక్రవారం మధ్యాహ్నం తిరుమలకు బయలుదేరారు. మార్గంలోని 7వ కిలోమీటరు మలుపు వద్ద జీపు అదుపుతప్పి బోల్తాపడింది. భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అనంతరం టీటీడీ ఆటోక్లినిక్ సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రమాదం జరగడానికి గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు.

కారు బీభత్సం

గూడూరు అర్బన్, మే 31: మద్యంమత్తులో యువకుడు కారును అతివేగంగా నడిపి బీభత్సం సృష్టించాడు. ఈ ఘటన గురువారం రాత్రి పట్టణంలో జరిగింది. నాయుడుపేటలోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న ఆకాష్ కారులో గూడూరు రైల్వేస్టేషన్‌లో అతని స్నేహితుడిని దింపాడు. అక్కడినుంచి అతివేగంగా ఆసుపత్రిరోడ్డు, సంఘం థియేటర్ మీదుగా శివాలయంవీధిలో కారును నడపడంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. శివాలయం వీధిలోని ఓ స్పీడ్‌బ్రేకర్‌ను కారు ఢీకొని నిలిచిపోయింది. దీంతో స్థానికులు ఆకాష్‌కు దేహశుద్ధి చేసి ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించారు. పట్టణ సీఐ పాపారావు డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, మే 31: పట్టణంలోని అడవయ్య కాలనీలో ఉన్న గాడ్‌గ్రేస్ అనాథ శరణాలయంలో శుక్రవారం శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో కె.రవీంద్రబాబు, జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు...





నిర్మానుష్యంగా ఉన్న ఆర్టీసీ రోడ్డు - ప్రయాణికులు లేక వెలవెలబోతున్న పాత బస్టాండు

గూడూరు, మే 31: వడగాడ్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రోహిణి కార్తె మొదలు కావడంతో గత రెండు రోజులుగా పట్టణంలో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలుగా నమోదవుతోంది. ఉదయం 8గంటల నుంచే సూర్యుడు ప్రతాపం చూపిస్తుండడంతో ఇంటి నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయపడిపో తున్నారు. సాయంత్రం 5.30 గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. ఇంట్లో ఫ్యాన్లు వేసుకున్నా ఉక్కపోత తగ్గకపోవడంతో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. ఎండ తీవ్రతకు పట్టణంలోని ప్రధాన రోడ్డైన ఆసుపత్రిరోడ్డు, ఆర్టీసీ బస్టాండు రోడ్డు తదితర ప్రాంతాలు సాయంత్రం వరకు నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పాత బస్టాండులో ఖాళీగా దర్శనమిస్తోంది. సెలవులు కావడంతో సాయంత్రం 3 గంటల నుంచే క్రీడాకారులతో కళకళలాడే ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియం వెలవెలబోతుంది. పనుల మీద తిరిగేవారు గొడుగులను, టోపీలను ఆశ్రయిస్తున్నారు.

రూ.800 కోట్లతో రాష్ట్రంలో జూడో మార్షల్స్ విస్తరణ

ఒలంపిక్స్‌లో బంగారు పతకం లక్ష్యం ● జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగూరయ్య



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాగూరయ్య

నాయుడుపేట, మే 31: ఆదరణ కనుమరుగవుతున్న పురాతన మార్షల్ ఆర్ట్స్ జూడోను రూ.800 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడమే లక్ష్యమని జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు ఏ.నాగూరయ్య అన్నారు. నాయుడుపేటలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 1884లో ఆవిర్భవించిన జూడో వ్యక్తిగత సంరక్షణ క్రీడ అన్నారు. ప్రధానంగా బౌద్ధమత దేశాల్లో ప్రాచుర్యంలో ఉందన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్‌కు వెళ్లిన రవీంద్రనాథ్ ఠాగూర్ అక్కడ గమనించిన జూడోను భారతదేశానికి పరిచయం చేశారన్నారు. కొంతకాలం జూడోకి ప్రాచుర్యంలో ఉన్న తరువాత క్రమంగా కనుమరుగైందన్నారు. జీబీసీ మీడియా హౌస్ జూడోకు ప్రాచుర్యం కల్పిస్తోందన్నారు.

ఒలంపిక్స్ లక్ష్యం...

జాతీయ, ఆసియా స్థాయి క్రీడల్లో జూడోలో రాణించడంతోపాటు 2032 ఒలంపిక్స్‌లో బంగారు పతకాలు సాధించడం లక్ష్యంగా జూడో అసోసియేషన్ పని చేస్తుందన్నారు. ఓజిలి మండలం పెద్దపరియవద్ద ఉన్న క్రీడా కళాశాలలో రూ.200 కోట్లతో అత్యాధునిక సదుపాయాలతో క్రీడాకారుల కోసం ప్రత్యేక ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో క్రీడా కళాశాలతోపాటు స్టేడియం అందుబాటులోకి తీసుకుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జూడో అసోసి యేషన్ సభ్యులు రాయపు రమేష్‌నాయుడు, డాక్టర్ సందీప్, బట్టా సుబ్రహ్మణ్యం, డాక్టర్ సందీప్, ప్రసాద్, బాలు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సూర్య నారాయణ రెడ్డి

కోట, మే 31: మండలంలోని చిట్టేడు నందమూరి బసవతారకకాలనీలో శుక్రవారం చట్టాలపై అవగాహన జరిగింది. గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి, వాకాడు సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతల విషయమై గిరిజనులను అవగాహన కల్పించారు. కౌంటింగ్ పూర్తిఅయ్యేంత వరకు ఎలాంటి సభలు, సమావేశాలలో పాల్గొనకూడదన్నారు. రాజకీయ నాయకుల సంబరాలకు దూరంగా ఉండాలన్నారు. అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గిరిజనులకు అవసరమైన అన్ని వసతులు పోలీసుల పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు. ఇందు కోసం ఎన్నికల సమయంలో వర్తించే చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ నాగబాబు, పలు మండలాల పోలీసులు పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని దుగరాజపట్నం, కొండూరుపాళెం, జెమిని కొత్తపాళెం, తూపిలిపాళెం తదితర మత్స్యకార గ్రామాల్లో గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ హరికృష్ణ, ఎస్‌ఐ పవన్‌కుమార్ సహా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

తడ: ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నరసింహారావు హెచ్చరించారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎన్నికల సంఘం నిబంధలు విధించిందని ఆ మేరకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఫలితాల తరువాత ఎటువంటి ఊరేగింపులు, బాణసంచా పేలుళ్లు నిర్వహించరాదని ఆదేశాలున్నాయని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు గుమికూడరాదని తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని... ఉరేసుకున్న భర్త



గణేష్ మృతదేహం

తడ, మే 31: భార్య పు ట్టింటికి వెళ్లిపోయిందని మన స్థాపంతో యువకుడు ఉరేసుకున్నాడు. చెన్నై నగరం మన్నాడ్‌కు చెందిన గణేష్ (21)కు పూడి గ్రామానికి చెందిన మహిళతో రెండేళ్ల క్రితం వివాహమైంది. అప్పటినుంచి గణేష్ అత్తగారి ఇంటికి వచ్చి వెళ్తుంటాడు. కొద్దిరోజులుగా పూడిలోని ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. మనస్పర్థల కారణంతో వారంరోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన గణేష్ గురువారం రాత్రి సమయంలో తాను పనిచేసే దుకాణంలోనే ఉరి వేసుకున్నాడు. శుక్రవారం ఉదయం షాపుకు వచ్చిన యజమాని గణేష ఉరేసుకున్న విషయాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచార కేసులో నిందితుల అరెస్ట్

సూళ్లూరుపేట, మే 31: ప్రియుడిని నిర్బంధించి యువతిని అత్యాచారం చేసిన కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం శ్రీహరికోట పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ మధుబాబు తెలిపిన వివరాలు... ఈనెల 29న తీర ప్రాంత గ్రామ పొలాల్లోకి ఓ యువతి సహా ఆమె ప్రియుడిని తడకు చెందిన ఏళుమలై, బాలాజి మాయమాటలు చెప్పి తీసుకెళ్లారు.అక్కడికి వెళ్లిన తరువాత ప్రియుడిని నిర్బంధించి ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శ్రీహరికోట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

నీటిగుంటలో పడి యువకుడి మృతి

చిల్లకూరు, మే 31: మండలంలోని ఏరూరులో శుక్రవారం గ్రామానికి సమీపంలోని నీటిగుంటలో పడి వ్యక్తి యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్(30) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిగుంటలో పడి ఇరుక్కుపోయి మృతి చెందాడు. బహిర్భూమికి వెళ్లిన మనోజ్‌కుమార్ ఎంతసేపటికీ ఇంటికి రావకపోవడంతో కుటుంబసభ్యులు గాలించగా నీటిగుంటలో తేలుతుండడాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జామాయిల్ తోట దగ్ధం



కోట, మే 31 : మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీలో మైక్రో టవర్ కాలనీ వద్ద శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు జామాయిల్ తోటకు నిప్పు పెట్టారు. దీంతో మంటలు ఎగసిపడ్డాయి. ఆ మంటలు పక్కనే ఉన్న తాటిచెట్లకు పాకడంతో స్థానికులు కోట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే కొన్ని జామాయిల్ చెట్లు, తాటిచెట్లు పూర్తిగా కాలిపోయాయి. హెడ్ కానిస్టేబుల్ సిద్ధిక్, నాగరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



హోమంలో అర్చకులు, భక్తులు

గూడూరు, మే 31: హనుమజ్జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని పలు ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోనేటిమిట్ట కోదండరామాంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది. మాళవ్యా నగర్‌లోని శ్రీరామరక్ష కుటీరంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గోపూజ, విష్ణు సహస్రనామ పారాయణం, సీతారామ కల్యాణం నిర్వహించారు.

వైభవంగా కలశమాల శోభాయాత్ర



స్వర్ణముఖినదిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నాయుడుపేట టౌన్, మే 31: పట్టణంలోని అగ్రహారపేటలో కొలువై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శుక్రవారం సాయంత్రం స్వర్ణముఖి నదిలో కలశమాల శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం రామనామ సంకీర్తనలతో గాంధీమందిరం, పోలేరమ్మ ఆలయం మీదుగా ఆంజనేయస్వామి దేవస్థానానికి చేరుకుంది.

అమిత్‌షాను కలసిన కోట బీజేపీ నేతలు



కోట, మే 31: కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు తిరుపతి విమానాశ్రయంలో కోట బీజేపీ నాయకులు ఆయనకు ఆహ్వానం పలికారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు, కోర్ కమిటీ సభ్యులు గిరిధర్‌రెడ్డి పలువురు బీజేపీ నాయకులు గూడూరు నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

గూడూరు అర్బన్, మే 31: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తున్నట్టు ఏవో రమేష్ పేర్కొన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డుతో బయోమెట్రిక్ ద్వారా ఆర్‌బీకేలలో రైతులు పొందవచ్చని తెలిపారు.

నీడలేని పాత ఆర్టీసీ బస్టాండ్



పాత బస్టాండ్ వద్ద రోడ్డుపైనే ఉన్న ప్రయాణికులు

వెంకటగిరి టౌన్, మే 31: ప్రయాణికులకు వసతులు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారు. దీనికి నిదర్శనమే పాత ఆర్టీసీ బస్టాండు. నాలుగు సంవత్సరాలుగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి నుంచి తిరుపతి, నెల్లూరు, రాపూరు, నాయుడుపేట, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాలకు చేరుకోవచ్చు. పాత ఆర్టీసీ బస్టాండ్ వినియోగంలో లేకపోవడంతో షాపులుగా మార్చి బాడుగులకు ఇచ్చేయాలని మున్సిపాలిటీ అధికారులు నిర్ణయించారు. కొంతమంది స్వచ్ఛంద సేవా సమితి నిర్వాహకులు అక్కడ మరుగుదొడ్లు నిర్మిస్తే బాగుంటుందని గత పాలక వర్గానికి వినతిపత్రం అందించారు. అప్పటి నుంచి ఆ బస్టాండ్ మరుగుదొడ్డిగా మారిపోయింది. దీంతో ప్రయాణికులు ఎండకు, వానకు రోడ్లపైనే ఆర్టీసీ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పదవీ విరమణ సిబ్బందికి సన్మానం

గూడూరు అర్బన్/ వాకాడు/ కోట, మే 31: గూడూరు ఏరియా ఆసుపత్రిలో హోమియో ఫార్మాసిస్టుగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన రాఘవరెడ్డిని శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... 42 సంవత్సరాలుగా హోమియో ఫార్మాసిస్టుగా పేదలకు ఆయన సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు షరీనా, నాన్సీగ్రేస్, కృష్ణారెడ్డి, లహరి, మధుసూదన్‌రావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు. వాకాడు ఏరియా వెటర్నరీ శాఖలో నాలుగు దశాబ్దాల పాటు సేవలందించి శుక్రవారం పదవీ విరమణ చేసిన లైవ్‌స్టాక్ అధికారి ఎస్. నిర్మలా కుమారి దంపతులకు వాకాడు ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో వాకాడు, చిట్టమూరు మండలాల వెటర్నరీ డాక్టర్లు, పారామెడికల్ తదితర సిబ్బంది ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. డాక్టర్లు సీహెచ్ కృష్ణారావు, శ్రీహరి, మంజుల పాల్గొన్నారు. కోట మండల పరిధిలోని చిట్టేడులోని ఆయూష్ ఆసుపత్రిలో శుక్రవారం ఎన్‌ఈఎన్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌రెడ్డి పదవీ విరమణ సన్మానసభ జరిగింది. ప్రసాద్‌రెడ్డిని మెడికల్ ఆఫీసర్ సురేష్ ఆధ్వర్యంలో సన్మానించారు.

దాడిపై ఫిర్యాదు

వైసీపీ నాయకులపై కేసు

నాయుడుపేట టౌన్, మే 31: పట్టణంలో నివాసం ఉంటున్న తమ ఇంటిపై వైసీపీ నాయకుడు కె.అశోక్ కుటుంబసభ్యులు, మరో ముగ్గురు దాడి చేసినట్లు అదే పార్టీకి చెందిన పి.రాజేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం జరిగిన జాతరలో అమ్మవారి ఊరేగింపు సందర్భంగా ఇరువర్గాల మధ్య తలెత్తిన మనస్పర్థలను మనస్సులో పెట్టుకొని అదేరోజు అర్ధరాత్రి అశోక్ తన కుటుంబసభ్యులు, మరో ముగ్గురితో కలిసి తమ ఇంటికి చేరుకుని సీసీ కెమెరాలను, కిటికీ అద్దాలను పగలగొట్టి తలుపుతీయాలంటూ నానారభస సృష్టించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. సమాచారం అందుకుని అక్కడికి పోలీసులు చేరుకునేలోగా అశోక్ కుటుంబసభ్యులు పరారయ్యారన్నారు. రాజేష్ ఫిర్యాదు మేరకు అశోక్ కుటుంబసభ్యులు, శ్రీకాంత్, సాయి, వంశీపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన రోబోటిక్స్ శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు

కోట, మే 31: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరిగిన ఇండస్ట్రియల్ రోబోటిక్స్ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. తరగతులకు రాష్ట్రం నలుమూలల నుంచి పాలిటెక్నిక్ విద్యార్థులు హాజరయ్యారు. ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ అధ్యాపకులు డాక్టర్ ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వర్లు ఇండస్ట్రియల్ రోబోటిక్ ప్రోగ్రామింగ్, సిములేషన్‌పై శిక్షణ ఇచ్చారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబుతో కురుగొండ్ల భేటీ



వెంకటగిరి, మే 31: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. వెంకటగిరి ఎన్నికల సరళిపై చంద్రబాబుకి కురుగొండ్ల వివరించారు. 4వ తేదీ జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని తమ అధినేత సూచించినట్లు రామకృష్ణ తెలిపారు.

పోలేరమ్మ ఆలయం వద్ద అన్నదానం



నాయుడుపేట టౌన్, మే 31: పట్టణంలోని గడియారం సెంటర్ సమీపంలో ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం వద్ద అన్నదానం జరిగింది. జాతర మహోత్సవాలు చివరి రోజున శుక్రవారం పారిశ్రామికవేత్త పెసల జయరాజ్‌గోపాల్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ముందుగా పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు. పెసల కిషోర్‌బాబు, రమేష్‌బాబు, భాస్కర్, ఎస్.వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మునిరాజ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


కల్వర్టులో అశోక్ మృతదేహం

శ్రీకాళహస్తి, మే 31: రోడ్డు ప్రమాదంలో అశోక్(35) అనే యువకుడు దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు... ఏర్పేడు మండలం పల్లం దళితవాడకు చెందిన అశోక్ విద్యుత్‌శాఖలో ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తుండేవాడు. శ్రీకాళహస్తి పట్టణంలో విధులు ముగించుకుని గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మండలంలోని అక్కుర్తి వద్ద రోడ్డుపై నిర్మాణ దశలో ఉన్న కల్వర్టును ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఢీకొంది. వాహనంతో సహా అశోక్ కల్వర్టులో పడిపోయాడు. ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ అజయ్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతుడు అశోక్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

వరదయ్యపాళెం, మే 31: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వరదయ్యపాళెం పంచాయతీ గోపాలరావుకాలనీలో ఉంటున్న సునియా గురువారం మధ్యాహ్నం కళ్లు తిరిగి పడిపోయిందంటూ స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించిన విషయం తెలిసిందే. రెండవ వివాహం కోసమే తమ కుమార్తెను ఆమె భర్త ఫాజిల్ హత్య చేసి ఉంటాడని ఆరోపిస్తూ సునియా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ దివాకర్‌రెడ్డి శుక్రవారం గోపాలరావుకాలనీకి చేరుకుని ఫాజిల్, అతని కుటుంబసభ్యులు, మృతురాలు సునియా కుటుంబసభ్యులను వేర్వేరుగా విచారించారు. సునియా మృతదేహాన్ని బయటకు తీసి వైద్యాధికారి సుహైల్ అహ్మద్ పోస్టుమార్టం చేశారు. తహసీల్దారు ఉదయభారతి, సీఐ ఆధ్వర్యంలో శవ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత దర్యాప్తు పూర్తిచేసి నిజాలు నిగ్గు తేలుస్తామని సీఐ తెలిపారు.

సచివాలయాన్ని సందర్శించిన జిల్లా వైద్యబృందం


జిల్లా వైద్యబృందం

వరదయ్యపాళెం, మే 31: వరదయ్యపాళెం గ్రామ సచివాలయాన్ని జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం శుక్రవారం సందర్శించింది. రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, కౌమార దశలో ఉన్న బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ పి.శ్రీనివాసరావు, జిల్లా గణాంక అధికారి నాగేంద్రబాబు, డీపీహెచ్ఎంవో ఇన్‌చార్జి బేబేరాణి, డీపీవో ప్రకాష్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు అనిత, లావణ్య, పీహెచ్ఎన్ రాణెమ్మ, ఎంపీవో రవీంద్రుడు, సూపర్‌వైజర్ పవన్‌కుమార్, గుణ, శృతి, సునీత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షాను కలిసిన కోలా ఆనంద్


అమిత్‌షాతో కోలా ఆనంద్

శ్రీకాళహస్తి/రేణిగుంట, మే 31: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శుక్రవారం ఉదయం సతీసమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న అమిత్‌షాకు బీజేపీ నాయకులు వీడ్కోలు పలికారు.

పొగాకుపై పిల్లలు అవగాహన కలిగి ఉండాలి

రేణిగుంట, మే 31: పొగాకుపై పిల్లలు అవగాహన కలిగి ఉండాలని ఆకాంక్ష స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ధూమపానం వల్ల ఏటా ఎనిమిది మిలియన్ల మంది అనారోగ్యం బారిన పడి చనిపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జూలయన్ రాజు, ఐజయ్య, కామరాజు, ఆశా వర్కర్, హ్యూమన్ రైట్స్ సభ్యులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలి


ప్రజల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టరు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 31: పొగాకు వినియోగానికి దూరంగా ఉంటే ఆరోగ్యంగా జీవించవచ్చని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా శుక్రవారం నీర్పాకోట గిరిజన కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూమపానం, వాటి ఉత్పత్తులు అయిన గూట్కా, పాన్ పరాక్ వాడటం వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తులు, పక్షవాతం వంటి జబ్బులు వస్తాయన్నారు. పొగాకును పూర్తి స్థాయిలో నిర్మూలిస్తామని ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కనకదుర్గమ్మకు విశేష పూజలు



శ్రీకాళహస్తి, మే 31: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.. అలాగే సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

డంపింగ్ యార్డుల్లో ఇసుకను స్వాధీనం చేసుకోవాలి

ఆదిమూలం


సమావేశంలో మాట్లాడుతున్న ఆదిమూలం

నారాయణవనం, మే 31: డంపింగ్ యార్డుల్లోని ఇసుకను స్వాధీనం చేసుకోవాలని సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పేర్కొన్నారు. నారాయణవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా నియోజకవర్గంలో దోపిడీదారులు ఇసుకను యథేచ్ఛగా తమిళనాడుకు తరలించి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక, గ్రావెల్, అక్రమ రవాణాపై గతంలో పలుమార్లు ఆశాఖ మంత్రికి, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. రాత్రి పగలు తేడా లేకుండా డంపింగ్ యార్డుల్లోని ఇసుకను తరలిస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ శాఖాధికారులు తక్షణం స్పందించి ఇసుకను స్వాధీనం చేసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో రూల్స్ ప్రకారం కాకుండా గొడవలకు పాల్పడే వారే ఏజెంట్లుగా కూర్చోవాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఎన్నికల కమిషన్ నోటీసులు ఇచ్చి విచారించాలని డిమాండ్ చేశారు. ప్రశాంతమైన సత్యవేడు నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పెద్దిరెడ్డి మద్యం, డబ్బును విచ్చల విడిగా పంపిణీ చేశారని విమర్శించారు. పల్లెల్లో ప్రశాంతతను చెడగొట్టేలా గ్రామాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు కూడా చేశారని ఆరోపించారు. ఓటర్లు న్యాయం, ధర్మంవైపే నిలబడ్డారని, వైసీపీ ఎన్ని కుయుక్తులు పన్నిన జూన్ నాలుగున జరిగే ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచి టీడీపీ ప్రభంజనం మొదలు కానుందని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్: డీఎస్పీ


అఖిలపక్ష నాయకులతో డీఎస్పీ శ్రీనివాసరావు

పిచ్చాటూరు, మే 31: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా రాజకీయ పార్టీలు సహకరించాలని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం పిచ్చాటూరు పోలీస్‌స్టేషన్‌లో పిచ్చాటూరు, నాగలాపురం, కేవీబీపురం, నారాయణవనం, వడమాలపేట మండలాలకు చెందిన అఖిలపక్ష నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పుత్తూరు డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో మొత్తం 11 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. ఈ ప్రాంతాలతో పాటు మిగిలిన గ్రామాల్లో సైతం ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆర్మ్‌డ్ ఫోర్స్, మొబైల్ పార్టీ, స్థానిక పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శనివారం ఎగ్జిట్ పోల్స్ విడుదల నేపథ్యంలో రేపటి నుంచి పోలీసుశాఖ పలు ఆంక్షలు విధించిందన్నారు. పోలీసులు అనుమతి లేకుండా విజయోత్సవ సంబరాలు, ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం, విక్రయించడం నిషేధమన్నారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో నేర ప్రవృత్తి కలిగిన వారిని ఇప్పటికే గుర్తించామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అలాంటి వారిని హౌస్ అరెస్టు, పోలీస్‌స్టేషన్‌కు తరలించడం వంటి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పుత్తూరు రూరల్, సీఐ భాస్కర్ నాయక్, పిచ్చాటూరు, నాగలాపురం ఎస్ఐలు వెంకటేశ్వరులు, ఓబయ్య, అఖిలపక్ష నేతలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం


సుగంధి దంపతులను సన్మానిస్తున్న ఎంఈవో

కేవీబీపురం, మే 31: మండలంలోని కళత్తూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పనిచేసి శుక్రవారం పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు సుగంధి, ఆమె భర్త దొరస్వామిని ఎంఈవో లక్ష్మీపతి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు సన్మానించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ ఎంతోమంది బాలబాలికలకు విద్యాబుద్ధులు నేర్పించి వారు ఉన్నత స్థానంలోకి వెళ్లటానికి దోహదపడిన సుగంధి సేవలు ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, చెంగల్రాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ


సుబ్రహ్మణ్యంను పరామర్శిస్తున్న మురళీనాయుడు

శ్రీకాళహస్తి, మే 31: మండలంలోని కాసరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బొర్రా సుబ్రహ్మణ్యంను ఆ పార్టీ మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల సుబ్రహ్మణ్యం ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తి నుంచి కాసరం గ్రామానికి వెళ్తుండగా కుక్కలు దాడి చేయడంతో కింద పడి గాయపడ్డాడు. చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు గాలి మురళీనాయుడు, భాస్కర్‌నాయుడు, శ్రీరామ్ చెంచయ్య, రత్నయ్యనాయుడు, రాఘవులు యాదవ్, బాలాజీ, మహేష్‌నాయుడు తదితరులు బొర్రా సుబ్రహ్మణ్యంను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం


అమ్మవారి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, మే 31: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు


స్వర్ణ కవచం అలంకారంలో దక్షిణకాళికాదేవి

శ్రీకాళహస్తి, మే 31: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రకృతిని సంరక్షించుకుందాం

ఏర్పేడు, మే 31: ప్రకృతిని సంరక్షించి భావి తరాలకు కానుకగా అందించాలని సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ కేశవులు అన్నారు. ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పేడు మండలం కొత్తకాల్వ నుంచి పాపానాయుడుపేట వరకు నూతనంగా నిర్మించిన రోడ్డుకు ఇరువైపులా శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ స్థాపించినప్పటి నుంచి రెండు వేల మొక్కలను నాటి సంరక్షించామని, అలాగే ఆరు వేల మొక్కలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రామనాథరెడ్డి, లోకేష్, నరేంద్ర, మౌళి, రాజు, చాన్‌బాషా, వినయ్ పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ

నారాయణవనం, మే 31: నారాయణవనంలో వెలసిన కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, పద్మావతి అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణతో ఊంజల సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

90శాతం రాయితీతో విత్తనాలు ఇవ్వాలి

శ్రీకాళహస్తి, మే 31: ఖరీఫ్‌లో రైతుల డిమాండ్‌ను బట్టి వారికి అవసరమైన విత్తనాలను 90శాతం రాయతీతో సరఫరా చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వ్యవసాయారంగాన్ని పూర్తిగా నీరుగార్చాయని, 2023 ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడు జూన్‌లో వర్షాలు సమృద్ధిగా పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందజేయాలని తెలిపారు. నకిలీ పురుగుమందులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో దాసరి జనార్దన్, హేమలత, రంగయ్య, బాలగురవయ్య, మునిశంకర్, శంకరయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై బైండోవర్ కేసులు

రేణిగుంట, మే 31: టీడీపీ నాయకులపై రేణిగుంట అర్బన్ పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. శుక్రవారం టీడీపీ పట్టణాధ్యక్షుడు మెహబూబ్ బాషా, మాజీ సర్పంచు భాస్కర్ యాదవ్‌పై బైండోవర్ కేసులు నమోదు చేశారు, కాగా, ఇప్పటి వరకు వైసీపీ నాయకులపై కేసులు నమోదు చేయలేదు. పోలీస్‌స్టేషన్‌కు రావాలని వైసీపీ నాయకులను పోలీసులు పిలుస్తున్నా స్పందించడంలేదని సమాచారం.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు

బుచ్చినాయుడు కండ్రిగ, మే 31: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో శనివారం ఎగ్జిట్‌పోల్స్ విడుదల కానున్నాయని, ఈ సందర్భంగా మండలంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడరాదని, ఒకని కించపరిచే విధంగా మాట్లాడడం, వివాదాలు సృష్టించడం, టపాకాయలు కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రతాపరెడ్డి సేవలు మరువలేనివి


ఎంపీడీవోను సన్మానిస్తున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ, మే 31: ఎంపీడీవో ప్రతాపరెడ్డి సేవలు మరువలేనివని ఏవో త్రివిక్రమ్‌రావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రతాపరెడ్డి శుక్రవారం పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవోను సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

దివ్యాంగులందరూ బడిలో ఉండాలి


తేజ స్వరూప్‌తో మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి

వడమాలపేట, మే 31: దివ్యాంగులందరూ బడిలో ఉండాలన్నదే లక్ష్యమని సమగ్ర శిక్ష సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ చెప్పారు. శుక్రవారం వడమాలపేట మండలంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. వడమాల వడ్డిపల్లె గ్రామానికి చెందిన దివ్యాంగుడు తేజస్వరూప్ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. క్రమం తప్పకుండా బడికి పంపాలని కోరారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి దివ్యాంగుడూ బడిలో ఉండాలన్నా లక్ష్యంతో సమగ్ర శిక్ష ద్వారా సర్వే నిర్వహించి ప్రత్యేక అవసరాలుగత పిల్లలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 18 సంవత్సరాల లోపు 111 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారన్నారు. కొత్తగా గుర్తించిన పది మందిని వారి వయసును బట్టి వివిధ పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు తెలిపారు. వీరిని తీర్చిదిద్దే బాధ్యతను భవిత కేంద్రాలు తీసుకొన్నట్లు తెలిపారు. తమ పిల్లల ఎదుగుదలకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

టిప్పర్, ఇటాచీ సీజ్

వడమాలపేట, మే 31: అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తున్న ఇటాచీ, టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు. వడమాలపేట మండలంలోని ఎస్వీపురం రెవెన్యూ పరిధిలోని రామరాజుకండ్రిగ సమీపంలో గుట్టను చదును చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. నెంబర్లు, లైసెన్స్ లేని వాహనాలతో గ్రావెల్ తరలిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ధర్మారెడ్డి సిబ్బందితో వెళ్లి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతులపై రెవెన్యూ అధికారులు వివరణ మేరకు తగు చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఐ చెప్పారు.

రైల్వే పోలీసుల అత్యుత్సాహం... వాహనదారులకు ఇక్కట్లు


రైల్వేస్టేషన్ వద్ద గొలుసులతో వాహనాలను బంధించిన దృశ్యం

పుత్తూరు అర్బన్, మే 31: రైల్వే పోలీసుల అత్యుత్సాహం వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. రైల్వేస్టేషన్ వద్ద వాహనదారులకు ఆర్పీఎఫ్‌కు మధ్య నిత్యం వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. రైల్వే పోలీసులు ప్రయాణికులకు సంబంధించిన వాహనాలను స్వాధీనం చేసుకుని జరిమానాల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పుత్తూరు రైల్వేస్టేషన్ ముఖద్వారం ఆనుకుని వాహనాల పార్కింగ్‌ను నిరోధిస్తూ రైల్వేశాఖ నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేసింది. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకించి స్టాండ్ ఉండడంతో అక్కడ పార్కింగ్ చేసుకోవాలని సూచనలిస్తోంది. అయితే ప్రయాణికులను దిగబెట్టేందుకు, తిరిగి తీసుకువెళ్లేందుకు వచ్చే వాహనాలు సైతం స్టాండ్‌లోనే పార్కింగ్ చేయాలని ఆర్పీఎఫ్ పోలీసులు నిబంధనలు విధిస్తుండడం వివాదానికి కారణమవుతోంది. నిమిషం పాటు తిరిగి వెళ్లిపోయేందుకు స్టాండ్‌లో పార్కింగ్ ఎందుకు చేయాలని వాహనదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఆర్పీఎఫ్ పోలీసులు వాహనాలను గొలుసులతో బంధించి జరిమానాలు విధిస్తుండడం, రసీదులు ఇవ్వాలని కోరుతున్న వాహనదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తుండడం పట్ల వివాదాలు జరుగుతున్నాయి. ఆర్పీఎఫ్ పోలీసులు రైల్వేస్టేషన్‌లో ఉండే పార్కింగ్ కాంట్రాక్టర్‌తో లోపాయికారి ఒప్పందం చేసుకుని వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం కుటుంబసభ్యులను రైల్వే స్టేషన్‌లో దిగబెట్టేందుకు పరమేశ్వరమంగళం గ్రామానికి చెందిన కిరణ్ ద్విచక్ర వాహనంపై రైల్వేస్టేషన్‌కు వచ్చారు. వాహనాన్ని పార్క్ చేసి లగేజీని ప్లాట్‌ఫాం పైకి చేర్చి తిరిగి వచ్చే లోపు ఆర్పీఎఫ్ పోలీసులు ఆయన వాహనాన్ని గొలుసుతో బంధించారు. దీనిపై ప్రశ్నిస్తే రూ.500 జరిమానా చెల్లించమని సూచించారు. చెల్లించేందుకు సిద్ధపడగా రసీదు ఇచ్చేందుకు మాత్రం ఆర్పీఎఫ్ పోలీసులు నిరాకరించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వాగ్వాదం చేటుచేసుకోగా కిరణ్ పట్ల ఆర్పీఎఫ్ పోలీసులు అనుచితంగా ప్రవర్తించడంతో అక్కడే ఉన్న స్థానికులు పోలీసులను నిలదీశారు. నిత్యం ఇలాంటి సంఘటనలు రైల్వేస్టేషన్ వద్ద చోటుచేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నర్సుల సేవలు ప్రధానం


డిగ్రీ పట్టాలతో నర్సింగ్ విద్యార్థినులు

పుత్తూరు, మే 31: వైద్య చికిత్స తర్వాత రోగులు సత్వరం కోలుకునేందుకు నర్సుల సేవ ప్రధానమని కేకేసీ నర్సింగ్ కళాశాల చైర్మన్ కుప్పయ్యశెట్టి అన్నారు. పుత్తూరులోని కళాశాలలో శుక్రవారం నర్సింగ్ విద్యార్థినులకు వీడ్కోలు, స్వాగతం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వైద్యవృత్తిలో కొత్తగా ప్రవేశించిన విద్యార్థినులు రోగుల పట్ల మానవతా దృష్టితో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ రెడ్డెమ్మ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జాన్సీరాణి, హోమియోపతి కళాశాల ప్రిన్సిపాల్ శరవణన్ పాల్గొన్నారు.